హామీల అమలుపై ఆందోళ న బాట

- రంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట 15 రోజుల నుంచి దీక్షలు
- ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్
- పట్టించుకోని ప్రభుత్వ తీరుపై ప్రజా సంఘాల మండిపాటు

కండ్లకు గంతలు కట్టుకుని నిరసన వ్యక్తం చేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులు

రంగారెడ్డి, డిసెంబర్ 20 (నమస్తే తెలంగాణ): అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ నేతలు అమలు కాని హామీలను గుప్పించారు. అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని అమలు చేయకపోవడంతో సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు అన్ని వర్గాల వారికి న్యాయం చేస్తామంటూ పెద్ద ఎత్తున హామీలు ఇచ్చింది. అధికారంలోకి వచ్చి ఏడాది దాటుతున్నా వాటి అమలుపై ఏ మాత్రం దృష్టి సారించడం లేదు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చాలంటూ పెద్ద ఎత్తున ఆందోళనలకు దిగుతున్నారు. ఈ ఆందోళనల్లో భాగంగా కలెక్టర్ కార్యాలయం ఎదుట 15రోజుల పాటు దీక్షలు చేస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ప్రస్తుత అసెంబ్లీ సెషన్‌లోనైనా తమ సమస్యలను సభా దృష్టికి తీసుకొచ్చి వాటి పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తున్నదని భావిస్తున్న వారికి ఈ సారి కూడా నిరాశే మిగిలే అవకాశాలున్నాయి. హామీలను అమలు చేయాలంటూ ఆందోళనకు దిగే వారిని ఎక్కడికక్కడే అరెస్టులు చేస్తున్నారు. మరికొందరిపై అక్రమంగా కేసులు కూడా పెడుతున్నారు.

15 రోజులుగా కలెక్టర్ కార్యాలయం ఎదుట పడిగాపులు

విద్యాశాఖలో పని చేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులు తమను పర్మినెంట్ చేయాలని 15 రోజులుగా కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన దీక్షలు చేపట్టారు. రోజుకో తరహాలో నిరసన వ్యక్తం చేస్తూ దీక్షలు చేస్తున్న కాంట్రాక్టర్ ఉద్యోగులను ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. శుక్రవారం కాంట్రాక్టర్ కార్మికులు కండ్లకు నల్ల బట్ట కట్టుకుని వినూత్న నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పద్మ, ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యాదయ్య హాజరై మాట్లాడుతూ.. ప్రభుత్వం ఎన్నికలకు ముందు విద్యాశాఖలో పనిచేస్తున్న కాంట్రాక్టర్ కార్మికులకు రెగ్యులరైజ్ చేస్తామని హామీ ఇచ్చిందని, అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్నా తమ సమస్యలు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో ఏమాత్రం స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 15 రోజుల నుంచి తాము నిద్రాహారాలు మాని దీక్షలు చేస్తున్నా ఏమాత్రం పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. కేజీబీవీ, సర్వ శిక్షా అభియాన్‌లో పని చేస్తున్న నాన్‌టీచింగ్ ఉద్యోగులపై ప్రభుత్వం వివక్ష చూపుతున్నదని పేర్కొన్నారు. కాంట్రాక్ట్ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని వారు కోరారు.

ఆయాలు, ఆశల సమస్యలపై నిర్బంధం..

తమ సమస్యలు పరిష్కరించాలంటూ కోరుతున్న ఆశ వర్కర్లు, ఏఎన్ఎంలను నిర్బంధించి పోలీస్ స్టేషన్లకు తరలిస్తున్నారు. నిత్యం ప్రజా ఆరోగ్యంపై గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి గర్భిణులు, బాలింతలు, చిన్నారులను కంటికి రెప్పలా కాపాడుతున్న ఆశ వర్కర్లు, ఏఎన్ఎంల సమస్యలు పరిష్కరిస్తామని ఎన్నికలకు ముందు హామీ ఇచ్చి నేడు కాలరాస్తున్న సర్కారుపై వారు సర్వత్రా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అలిసిపోయిన పండుటాకులు..

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ దివ్యాంగులు ఆందోళన చేస్తున్నారు. ప్రభుత్వం ఎన్నికలకు ముందు వృద్ధులు, వితంతువులు, దివ్యాంగుల పింఛన్లు పెంచుతామని హామీ ఇచ్చిందని తెలిపారు. అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా పింఛన్ల పెంపు మాట కూడా ఎత్తడం లేదని ఆరోపిస్తూ దివ్యాంగులు గతంలో ఆందోళనకు దిగారు. సుమారు 10 రోజుల పాటు కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టి చివరికి అలిసిపోయిన పండుటాకులు, దివ్యాంగులను ప్రభుత్వం కరుణిస్తుందా అనే ఆశతో ఎదురు చూస్తున్నారు. వృద్ధుల పింఛన్లు రూ.3వేల నుంచి రూ.4వేలకు పెంచుతామని, దివ్యాంగుల పింఛన్ల కూడా పెంచుతామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట ఇచ్చి తప్పారని పలువురు వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు వాపోతున్నారు. ఇప్పటికైనా పింఛన్లు వెంటనే పెంచాలని వారు కోరుతున్నారు.

మున్సిపాలిటీ వద్దు.. పంచాయతీలే ముద్దు

- వ్యవసాయ ఆధారిత గ్రామాలపై పన్నుల భారం మోపాలని ప్రభుత్వ కుట్ర
- స్థానిక ఎమ్మెల్యే ఎవరి అభిప్రాయం తీసుకోకుండా ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారు
- ఎమ్మెల్యేకు చిత్తశుద్ధి ఉంటే జీవో 69 అమలుపై ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలి
- బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కొంపల్లి అనంతరెడ్డి, సీనియర్ నాయకుడు ఎంపీ రవూఫ్

మొయినాబాద్‌లో మున్సిపాలిటీ వద్దని ఆందోళన చేస్తున్న బీఆర్ఎస్ నేతలు

మొయినాబాద్, డిసెంబర్ 20 : పచ్చని పల్లెల్లో మున్సిపాలిటీ చిచ్చు వద్దని... గ్రామ పంచాయతీలుగానే కొనసాగనివ్వాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కొంపల్లి అనంతరెడ్డి, సీనియర్ నాయకుడు ఎంఏ రవూఫ్ అన్నారు. మొయినాబాద్‌లోని ఏడు గ్రామాలతో మున్సిపాలిటీగా ఏర్పాటు చేస్తున్నామని ప్రభుత్వం చేసిన ప్రకటనను వ్యతిరేకిస్తూ బీఆర్ఎస్ నేతలు మాకు మున్సిపాలిటీ వద్దు... గ్రామ పంచాయతీలే ముద్దు అని నినాదాలు చేస్తూ శుక్రవారం మండల కేంద్రంలోని హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారిపై ఆందోళన చేపట్టారు. ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య ఏకపక్షంగా వ్యవహరించి మొయినాబాద్‌లోని ఏడు గ్రామాలతో మున్సిపాలిటీ ఏర్పాటు చేయడానికి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చి ప్రకటన చేయించారన్నారు. మున్సిపాలిటీ కావాలని ప్రజలెవరూ ఎమ్మెల్యేను కోరలేదని, ఎవరి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా ఎలా చేస్తారని ప్రశ్నించారు. హైదరాబాద్‌కు అతి సమీపంలో మొయినాబాద్ ఉన్నప్పటికీ.. జీవో 111తో మండల పరిధిలోని గ్రామాలు ఇంకా అభివృద్ధికి దూరంగా ఉన్నాయన్నారు. ఇక్కడి ప్రజలు వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారన్నారు. ప్రస్తుతం మండలంలోని ప్రజలకు ఉన్న ఆదాయం మేరకు జీవిస్తున్నారని, మున్సిపాలిటీ వస్తే పన్నుల భారాన్ని ఎలా భరిస్తారని ప్రశ్నించారు.

జీవో 69ని అమలు చేసేలా ఒత్తిడి తేవాలి

మున్సిపాలిటీ ఏర్పాటుకు ముందు మొయినాబాద్ మండల ప్రజల మీద ఉన్న జీవో 111ను సడలించి బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 69ను అమలు చేసేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చి ఎమ్మెల్యే తన చిత్తశుద్ధి చాటుకోవాలని బీఆర్ఎస్ నాయకులు అన్నారు. ముందుగా జీవో 111ను పూర్తిగా ఎత్తివేసి అప్పుడు మున్సిపాలిటీని ఏర్పాటు చేయడానికి నిర్ణయం తీసుకోవాలన్నారు. మున్సిపాలిటీ ఏర్పాటుతో ప్రజలకు ఎలాంటి ప్రయోజనం లేదన్నారు. ఎవరి లబ్ధి కోసం.. ఎవరి ప్రయోజనాల కోసం మున్సిపాలిటీ ఏర్పాటు ప్రతిపాదన తీసుకొచ్చారని ప్రశ్నించారు. మున్సిపాలిటీ ఏర్పాటుపై ప్రభుత్వం నిర్ణయం మార్చుకోని పక్షంలో అన్ని పార్టీలతో కలిసి ఉద్యమం చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు కొత్త నర్సింహారెడ్డి, దారెడ్డి వెంకట్‌రెడ్డి, నర్సింహా గౌడ్, మాజీ సర్పంచ్ సుధాకర్‌యాదవ్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ జగన్‌మోహన్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ కొత్త మాణిక్‌రెడ్డి, అంజయ్యగౌడ్, డేవిడ్, షాబాద్ ప్రవీణ్, పూసల పరమేశ్, అరవింద్ రజక, అలీం, అసీఫ్, గునుగుర్తి చిన్న, మేడిపల్లి రాజు, కిరణ్, సునీల్‌కుమార్, కర్రోల్ల భాస్కర్, ఖైయూప్, షరీఫ్, అమేర్, సంజీవ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

రుణాల పంపిణీ వేగవంతంగా పూర్తి చేయాలి

- కలెక్టర్ ప్రతీక్‌జైన్
- బ్యాంక్ లింకేజీ, స్త్రీ నిధిపై సంబంధిత అధికారులతో సమీక్ష

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

వికారాబాద్, డిసెంబర్ 20 : జిల్లాలో బ్యాంక్ లింకేజీ, స్త్రీ నిధి రుణాల పంపిణీ త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో గ్రామీణ అభివృద్ధి అధికారి ఆధ్వర్యంలో బ్యాంక్ లింకేజీ, స్త్రీ నిధిపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళా సంఘాలు రుణాల బీమాను వినియోగించుకోవాలని తెలిపారు. 60 ఏండ్ల లోపు ఉన్న మహిళా సంఘాల సభ్యులు తీసుకున్న బ్యాంక్ రుణాలకు 2024 మార్చి 14 నుంచి ప్రభుత్వం ఉచిత రుణ సౌకర్యం కల్పించిందని, ప్రమాద బీమా పథకాన్ని అమలు చేస్తున్నదని తెలిపారు. రుణం తీసుకున్న సభ్యురాలు మృతి చెందితే ఆ రుణానికి సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు మండల సమాఖ్యలో అందజేసి లబ్ధి పొందాలని సూచించారు.

లక్ష్యాలు సాధించాలి

జిల్లాలో మహిళా సమాఖ్య సంఘాలకు బ్యాంకు లింకేజీ, స్త్రీ నిధి ద్వారా అర్హత కలిగిన సంఘాలకు రుణాలను టార్గెట్ ప్రకారం రుణాలను పంపిణీ చేసి, లక్ష్యాలను సాధించాలని కలెక్టర్ తెలిపారు. రుణాల పంపిణీతో పాటు రికవరీ వంద శాతం పూర్తి చేయాలని సూచించారు. ప్రతి వారం గ్రామీణ అభివృద్ధి అధికారి ఆధ్వర్యంలో క్షేత్ర స్థాయి సిబ్బందితో సమీక్షించాలని, రికవరీలపై ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలన్నారు. రుణాలు తీసుకునే సమయంలో ఏవైనా సమస్యలు వస్తే సంబంధిత అధికారి దృష్టికి తీసుకు రావాలని, క్లెయిమ్‌లకు సంబంధించిన రిపోర్ట్ సబ్మిట్ చేయాలని ఆదేశించారు. రుణాలపై అందరికీ అవగాహన కల్పించి వంద శాతం పూర్తయ్యేలా చూడాలన్నారు. టూవీలర్ పైన మొబైల్ క్యాంటీన్, ట్రౌన్ రైసు, మిల్లెట్స్ ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శ్రీనివాస్, అదనపు పీడీ సరోజ, స్త్రీ నిధి ఆర్ఎం ఉదయకుమారి, డీపీఎంలు, ఏపీఎంలు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బోనాలు తీసి సమగ్రశిక్షా ఉద్యోగుల నిరసన

సమ్మెలో భాగంగా వికారాబాద్‌లో బోనాలు తీస్తున్న ఉద్యోగులు

వికారాబాద్, డిసెంబర్ 20 : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి దీవెనలు ఇచ్చి సమగ్ర శిక్షా ఉద్యోగులను క్రమబద్ధీకరణ చేసి న్యాయం జరిగేలా చూడాలని సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కేతావత్ గాంగ్యనాయక్ అమ్మవారికి పూజలు చేశారు. శుక్రవారం నాటికి సమగ్ర శిక్షా ఉద్యోగుల నిరసన 15వ రోజుకు చేరుకోవడంతో మహిళలు అమ్మవారికి బోనాలు సమర్పించారు. ఈ బోనాలు వికారాబాద్ జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయం నుంచి ఎమ్మార్పీ చౌరస్తాలో ఉన్న అమ్మవారి ఆలయం వరకు ర్యాలీగా వెళ్లారు. ఈ ర్యాలీలో డప్పు చప్పుళ్లు, శివసత్తుల పూనకాలు, పోతురాజుల విన్యాసాలు చేస్తూ ర్యాలీ తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వికారాబాద్ జిల్లాలో 575 మంది సమగ్ర శిక్షా ఉద్యోగులు 15 రోజుల నుంచి సమ్మె చేస్తున్నారన్నారు. సమ్మెలో ఎమ్మార్పీ, సీఆర్సీ, పాఠశాల, కేజీబీవీ, యూ ఆర్ఎస్, మాడల్ స్కూల్ , డీపీవో స్థాయిలో అన్ని విభాగాల ఉద్యోగులు పాల్గొని సమగ్రశిక్షా ఉద్యోగులకు న్యాయం చేయాలని మద్దతు ఇచ్చారని తెలిపారు. సమగ్ర శిక్షా ఉద్యోగులను వెంటనే విద్యా శాఖలో విలీనం చేసి రెగ్యులరైజ్ చేయాలని, అప్పటివరకు తక్షణమే పేస్కేల్ అమలు చేయాలని, మాడల్ స్కూల్‌లో సమగ్ర శిక్షకు అనుబంధంగా పనిచేస్తున్న ఉద్యోగులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మెసేంజర్ అధ్యక్షుడు శ్రీశైలం, మహిళా నాయకురాలు ప్రభావతి, డీపీవో శేఖర్, పీటీఐ రవికుమార్, ఆయా మండలాల కేజీబీవీ పాఠశాలల ఎస్‌వోలు ఆశాలత, స్వరూప, శైలజ, రాధిక, పల్లవి, దేవి, రాజేశ్వరి, స్రవంతి, సుమిత్ర, చైతన్య, రఘుసింగ్, రఘు, సర్వర్, వెంకట్ రెడ్డి, దశరథ్, మాధవి, మమత, మోహన్, జ్యోతి, ప్రియాంక, అనితా, రమాదేవి, విజయ్, నర్సింహులు, నాగయ్య, సమగ్రశిక్షా అన్ని విభాగాల ఉద్యోగులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుల ముందస్తు అరెస్టు

బీఆర్ఎస్ నాయకులను అరెస్టు చేసిన పోలీసులు

మర్పల్లి, డిసెంబర్ 20 : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌పై ఏసీబీ అధికారులు కేసు నమోదు చేయడంపై శుక్రవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్ వెళ్లకుండా పార్టీ మండల నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టు చేసి మర్పల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు వారు తెలిపారు.. అరెస్టైన వారిలో బీఆర్ఎస్ యూత్ మండల అధ్యక్షుడు మధుకర్, మాజీ ఉపసర్పంచ్ రాజు, పీర్యానాయక్, ఖాజా, మిత్ర, రవి, నర్సింహులు తదితరులు ఉన్నారు.

ఇంధన పొదుపు అందరి బాధ్యత

యాచారంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

యాచారం, డిసెంబర్ 20 : ఇంధనాన్ని పొదుపు చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఇందన వనరుల అభివృద్ధి సంస్థ జిల్లా మేనేజర్ సురేశ్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఇందన పొదుపు వారోత్సవాలపై శుక్రవారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం ఉపయోగిస్తున్న ఇందనంలో బొగ్గు, ముడి చమురు సింహ భాగం అన్నారు. ఇంధనాన్ని వృథా చేయకుండా పొదుపుగా వాడాలని సూచించారు. ఇందనం పొదుపుపై విద్యార్థులకు పెయింటింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

కేంద్రహోంమంత్రి అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి

ఆమనగల్లులో అమిత్‌షా దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

ఆమనగల్లు, డిసెంబర్ 20 : అనుచిత వ్యాఖ్యలతో భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌ను కేంద్ర హోంమంత్రి అమిత్‌షా అవమానించారని ఆయనను వెంటనే బర్తరఫ్ చేయాలని అంబేద్కర్, పూలే జ్ఞాన జాతర కమిటీ అధ్యక్షుడు సుధాకర్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆమనగల్లు పట్టణంలోని హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై అమిత్‌షా వ్యాఖ్యలకు నిరసనగా ప్రజా సంఘాల ఆధ్వర్యంలో అమిత్‌షా దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లౌకిక దేశమైన భారతదేశ ప్రజలపై మనువాద భావజాలాన్ని బలవంతంగా రుద్దేందుకు ఆర్ఎస్ఎస్, బీజేపీ ప్రయత్నం చేస్తున్నదన్నారు. దేశ పార్లమెంట్‌లో అమిత్‌షా అంబేద్కర్‌ను అవమానించడం దేశానికే సిగ్గు చేటన్నారు. అమిత్‌షా బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అంతకుముందు ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు కానుగుల వెంటకయ్య, మిన్నాల డేవిడ్, సాయిలు, కొప్పుయాదయ్య, చెన్నయ్య, శివశంకర్, పెంటయ్య, పోచయ్య, నర్సింహ్మ, జంగయ్య, ఈదమయ్య, కృష్ణయ్య తదితరులు ఉన్నారు.

నేటి నుంచి ధ్యాన మహాయాగం

- మహేశ్వర మహా పిరమిడ్‌లో 11 రోజులపాటు కొనసాగనున్న మహోత్సవాలు
- ప్రపంచ నలమూలల నుంచి రానున్న పిరమిడ్ మాస్టర్లు, ధ్యానులు
- ధ్యాన యాగానికి ఏర్పాట్లు పూర్తి చేసిన పిరమిడ్ ట్రస్టు సభ్యులు

మహేశ్వర మహా పిరమిడ్‌ను సందర్శించిన శంషాబాద్ డీసీపీ రాజేశ్

కడ్తాల్, డిసెంబర్ 20 : ధ్యాన ప్రపంచానికి చిహ్నంగా మారిన కడ్తాల్ మండల పరిధిలోని అన్మాస్‌పల్లి సమీపంలో ఉన్న కైలాసపురి మహేశ్వర మహాపిరమిడ్‌లో పత్రీజీ ధ్యాన మహాయాగం సభలకు సర్వం సిద్ధమయ్యాయి. పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీస్ మూవ్‌మెంట్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో శనివారం నుంచి ఈ నెల 31 వరకు 11 రోజులపాటు నిర్వహించే ధ్యాన మహాయాగ సభలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పిరమిడ్ ట్రస్ట్ చైర్మన్ కోర్పోలు విజయభాస్కర్‌రెడ్డి తెలిపారు. ఈ సభలకు తెలుగు రాష్ట్రాలతో పాటు దేశ, విదేశాల నుంచి ధ్యాన గురువులు, అధ్యాత్మిక వేత్తలు, పిరమిడ్ మాస్టర్లు హాజరవుతారని ఆయన తెలిపారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే ధ్యానుల కోసం పిరమిడ్ ఆవరణలో తాత్కాలిక, శాశ్వత గదులు, ఉచిత వసతితోపాటు భోజన సదుపాయం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమాలను వీక్షించడానికి పిరమిడ్ ఆవరణంలో ప్రత్యేక వేదికను ఏర్పాటు చేశారు. పిరమిడ్ ఆవరణలో సీసీ కెమెరాలతో పటిష్టమైన నిఘాను ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రతి రోజూ ఉదయం 5 నుంచి రాత్రి 8 గంటల వరకు సంగీత విద్యాంసులచే ధ్యానం, సుభాశ్ పత్రీజీ వీడియో సందేశం, ఉదయం 10 నుంచి రాత్రి 9 గంటల వరకు ఆధ్యాత్మిక ప్రవచనాలు, గురువుల సమ్మేళనం, సాంస్కృతిక కార్యక్రమాలు, 225 గంటలపాటు అఖండ ధ్యానం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు వివరించారు.

పిరమిడ్‌ను సందర్శించిన శంషాబాద్ డీసీపీ రాజేశ్

పత్రీజీ ధ్యాన మహాయాగం శనివారం నుంచి ప్రారంభమవుతున్న నేపథ్యంలో, శుక్రవారం సాయంత్రం శంషాబాద్ డీసీపీ రాజేశ్ మహేశ్వర మహా పిరమిడ్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా పిరమిడ్‌లో భద్రత ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. 11 రోజులపాటు జరగనున్న వేడుకలకు తీసుకోవాల్సిన భద్రత రక్షణ చర్యలను నిర్వాహకులకు ఆయన వివరించారు. ఆయన వెంట సీఐ శివప్రసాద్, ఎస్ఐ వరప్రసాద్, ట్రస్ట్ కో-ఆర్డినేటర్ మాధవి ఉన్నారు.

విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

రాష్ట్ర స్థాయి పోటీలకు ముజాహిద్‌పూర్ విద్యార్థి ఎంపిక

దోమ, డిసెంబర్ 20 : మండల పరిధిలోని ముజాహిద్ ఆదర్శ పాఠశాల విద్యార్థి వెంకటేశ్ రాష్ట్ర స్థాయి ఖో ఖో పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. గురువారం పరిగి పట్టణంలోని మినీ స్టేడియంలో నిర్వహించిన సీఎం కప్ జిల్లా స్థాయి ఖో ఖో పోటీలు నిర్వహించారని తెలిపారు. ఈ పోటీల్లో వెంకటేశ్ ఉత్తమ ప్రతిభను కనబర్చడంతో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారని తెలిపారు. ఈ సందర్భంగా ఆ విద్యార్థితో పాటు వ్యాయామ ఉపాధ్యాయుడు కృష్ణారెడ్డిని శుక్రవారం ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పల్లెప్రగతి దేశానికే ఆదర్శం

శిక్షణా శిబిరంలో పాల్గొన్న బీహార్ రాష్ట్రానికి చెందిన సర్పంచ్‌లతో కడ్తాల్ మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి

కడ్తాల్, డిసెంబర్ 20 : బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో చేపట్టిన పల్లెప్రగతి కార్యక్రమంతో తెలంగాణలోని గ్రామాలు గణనీయమైన అభివృద్ధి సాధించినట్లు బీహార్ రాష్ట్రానికి చెందిన సర్పంచ్‌లు ప్రశంసించారు. రాజేంద్రనగర్‌లోని జాతీయ పంచాయతీరాజ్-గ్రామీణాభివృద్ధి సంస్థలో రెండు రోజుల పాటు నిర్వహించనున్న శిక్షణ కార్యక్రమాల్లో శుక్రవారం కడ్తాల్ మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి బుధవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్ఐఆర్‌డీపీఆర్‌లో బీహార్ రాష్ట్రానికి చెందిన సర్పంచ్‌లతో ఆయన సమావేశమై, గత ఐదేండ్లలో తెలంగాణలోని గ్రామాల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం సహకారంతో చేపట్టిన అభివృద్ధి పనులను వివరించారు. గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ, ఇంకుడు గుంతలు, మరుగుదొడ్ల నిర్వహణ, తడి-పొడి చెత్త వేరు చేసే విధానం, పల్లెప్రకృతి వనం, రైతు వేదిక, వైకుంఠధామం, గ్రామ పంచాయతీల సొంత ఆదాయ వనరుల పెంపు తదితర అంశాలను వారికి వివరించారు. ఆరోగ్యకర గ్రామాలను తీర్చిదిద్దడంలో ప్రజలు భాగస్వాములు ఉండాలనే ఉద్దేశంతో, ప్రజలందరితో చర్చించి సమష్టి నిర్ణయాలు తీసుకోవడంతోనే గ్రామాలు అభివృద్ధి సాధించాయని తెలిపారు. కార్యక్రమంలో అసోసియేట్ ప్రొఫెసర్ తరుణ్‌రాజ్, బీహార్ రాష్ట్రం గ్రామ సర్పంచ్‌లు పాల్గొన్నారు.

విద్యతో పాటు క్రమ శిక్షణ అవసరం

- ఎన్‌పీఎస్ ఢిల్లీ జాయింట్ కమిషనర్ జ్ఞానేంద్రకుమార్
- ముగిసిన నవోదయ జాతీయ సమైక్యత సమ్మేళనం

సంగీత కచేరి నిర్వహిస్తున్న విద్యార్థులు

నందిగామ, డిసెంబర్ 20 : విద్యార్థులకు విద్యతో పాటు క్రమ శిక్షణ ఎంతో అవసరమని నవోదయ విద్యాలయ సమితి ఢిల్లీ జాయింట్ కమిషనర్ జ్ఞానేంద్ర కుమార్ అన్నారు. రంగారెడ్డి జిల్లా నందిగామ మండలం కన్హా శాంతి వనంలో నిర్వహిస్తున్న నవోదయ జాతీయ సమైక్యత సమ్మేళనం ముగింపు వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన నవోదయ విద్యార్థులు సాంస్కృతిక, జానపద నృత్యాలు, సంగీత కచేరి, కూచిపూడి, టాయ్స్ ఆర్ట్స్, పెయింట్ ఎగ్జిబిషన్ ప్రదర్శనలతో విద్యార్థులు అకట్టుకున్నారు. ఎన్‌వీఎస్ ఢిల్లీ జాయింట్ కమిషనర్ జ్ఞానేంద్ర కుమార్ హాజరై విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు ఉన్నతమైన లక్ష్యంతో ముందుకు వెళ్లాలని, విద్యతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. రెండు రోజులుగా జరిగిన నవోదయ జాతీయ సమ్మేళనంతో వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన విద్యార్థులు అద్భుతంగా తమ కళలను ప్రదర్శించారని వారిని అభినందించారు. కార్యక్రమంలో నవోదయ సమితి హైదరాబాద్ డిప్యూటీ కమిషనర్ గోపాలకృష్ణ, నవోదయ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఆదిబట్ల, డిసెంబర్ 20: స్టేట్ మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఇందిరమ్మ మహిళా శక్తి ద్వారా మైనార్టీ మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్లు అందించేందుకు ఈ నెల 31 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని మైనార్టీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి నవీన్‌కుమార్‌రెడ్డి కోరారు. మైనార్టీ మహిళలు (ముస్లింలు, బుద్ధులు, సిక్కులు, జైనులు, పార్శీలు) tgobmms.cgg.gov.in ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్ అప్లికేషన్‌తోపాటు తెల్లరేషన్‌కార్డు లేదా ఆహార భద్రత కార్డు, రెండూ లేకపోతే గ్రామీణ ప్రాంతం వారికి రూ.1.5 లక్షలు మించకుండా, పట్టణ ప్రాంతం వారికి రూ.2 లక్షలు మించకుండా ఆదాయ ధ్రువీకరణ పత్రం, వయసు 18 నుంచి 55 ఏండ్ల మధ్యలో ఉండాలని, ఆధార్‌కార్డు తదితర పత్రాలను కలెక్టరేట్‌లోని తమ శాఖ కార్యాలయంలో అందజేయాలని కోరారు.

వికారాబాద్‌లో..

వికారాబాద్ : ఇందిరమ్మ మహిళా శక్తి పథకం ద్వారా ఉచిత కుట్టు మిషన్ల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు తమ హార్డ్ కాపీలను జిల్లాలోని మైనార్టీ సంక్షేమ అధికారి కార్యాలయంలో అందజేయాల్సిన అవసరం లేదని ఆ శాఖ అధికారి హనుమంత్ రావు